క్లుప్తంగా

పశువైద్యాధికారికి సన్మానం



ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు పశువైద్యశాలలో వైద్యుడిగా పనిచేస్తున్న వీఎల్ఓ సుకుమార్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సుకుమార్ దంపతులను ఆత్మకూరు ఏడీఏ జయచంద్ర, సహచర పశువైద్యాధికారులు జయంతి, వెంకటేశ్వర్లు, సురేష్, ప్రసాద్, సుజని, తదితరులు ఘనంగా సత్కరించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



దుత్తలూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని ఏరుకొల్లులో ఎమ్మార్పీఎస్ జెండాను బుధవారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావంతోనే మాదిగలకు ఆత్మగౌరవం లభించిందన్నారు. సామాజిక పింఛన్ల పెంపునకు పోరాటం చేసిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కుతుందన్నారు. ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు యద్దనపూడి రమణయ్య, మండలాధ్యక్షుడు బర్రె అర్జున్, శ్యాంసన్, వెంకటేశ్వర్లు, వెంగయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

కామధేనులో పశువుల వేలం




కొండాపురం: చింతలదేవిలోని నేషనల్ కామధేను బ్రీడింగ్ సెంటర్‌లోని వివిధ జాతులకు చెందిన ఆవులు, దూడలు, గేదెలను అధికారులు బుధవారం వేలం వేశారు. మొత్తం 182 పశువులకు వేలం నిర్వహించగా, 66 ఆవులు, దూడలు, 49 గేదెలను రైతులు దక్కించుకున్నారు. మిగిలిన 66 పశువులను మరోమారు వేలం వేయనున్నట్లు క్షేత్రం జేడీ వెంకటేష్ తెలిపారు. వేలంలో దక్కించుకున్న పశువుల విలువను లెక్కించి తెలియజేస్తామన్నారు. డీడీ పెద్దిస్వామి, ఏడీ రామన్, జిల్లా పశువైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శబరి స్టాపింగ్ కోసం ఎదురు చూపులు



కావలి: కావలి రైల్వే స్టేషన్‌లో శబరి ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ కల్పించాలని పరిసర ప్రాంత ప్రజలు గడిచిన 24 ఏళ్లుగా కోరుతున్నారు. హైదరాబాద్ నుంచి తిరుపతి మీదుగా తిరువనంతపురం వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్(17230) రాత్రి 8.20 గంటలకు కావలికి వస్తుంది. రాత్రి వేళ కావలి నుంచి తిరుపతికి వెళ్లే వారికి ఇది అనువుగా ఉంటుంది. అలాగే కావలి ప్రాంత వ్యాపారులు చిత్తూరు, తమిళనాడులోని సేలం, ఈ రోడ్డు, తిరుప్పూర్, కోయంబత్తూర్, త్రిసూర్ తదితర ప్రాంతాలకు చేరుకోవడానికి సౌకర్యంగా ఉంటుంది. కేరళలోని పలు ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారికి ఈ రైలు అనుకూలంగా ఉంటుంది. తిరువనంతపురం నుంచి హైదరాబాద్‌కు చేరుకునే శబరి ఎక్స్‌ప్రెస్ (17229) కావలికి తెల్లవారుజామున 3.20 గంటలకు చేరుకుంటుంది. చీరాల, బాపట్ల, పొన్నూరు, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మిర్యాలగూడ, నల్గొండ, తదితర ప్రాంతాలకు ఉదయాన్నే 9 గంటలలోగా చేరుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ రైలును కావలి రైల్వే స్టేషన్‌లో నిలపాలని 2000వ సంవత్సరం నుంచి స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కంపచెట్లు తొలగించరూ..



ఆత్మకూరురూరల్: నువ్వూరుపాడు–దేపూరు మధ్యన సోమశిల–ఆత్మకూరు రోడ్డును ఇరువైపులా కంపచెట్లు ఆక్రమించాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కంపచెట్లు దట్టంగా పెరిగి రోడ్డుపైకి రావడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మలుపుల వద్ద కంపచెట్ల కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు.

పచ్చనేతలు కనికరిస్తేనే ఉపాధి

- ఫీల్డ్‌అసిస్టెంట్ల తొలగింపునకు యత్నం
- టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో పనుల నిలిపివేత
- ఆపై పనులు కల్పించడం లేదంటూ నోటీసులు
- నేతల సిఫార్సులకు జీహుజూర్ అంటున్న అధికారులు
- ఆకలితో అలమటిస్తున్న ఉపాధి కూలీలు



దుత్తలూరు మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దుత్తలూరు/ఆత్మకూరు: టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో ఉపాధి హామీ పథకం అధికారులు ఇటు కింది స్థాయి సిబ్బంది..అటు కూలీల కడుపు కొడుతున్నారు. వారి సిఫార్సులకు తలొగ్గి ఫీల్డ్‌అసిస్టెంట్లపై కత్తికట్టారు. వారిని తొలగించేందుకు పంచాయతీల్లో పనులు నిలిపివేయిస్తున్నారు. దీంతో కూలీలు ఆకలికేకలతో అలమటిస్తున్నారు. మరోవైపు పనులు కల్పించలేదనే సాకుతో ఫీల్డ్‌అసిస్టెంట్లకు నోటీసులు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పించడం ద్వారా వలసలను నివారించడమే లక్ష్యంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తోంది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు ఈ పథకాన్ని తమకు ఆదాయవనరుగా మార్చుకోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించుకునే దిశగా పావులు కదుపుతున్నారు.

కొందరు ఫీల్డ్‌అసిస్టెంట్లకే నోటీసులు

దుత్తలూరు మండలంలోని బండకిందపల్లి, భైరవరం, బోడవారిపల్లి, దుత్తలూరు, కొత్తపేట, నర్రవాడ, రెడ్లదిన్నె, సోమలరేగడ, తెడ్డుపాడు, తిమ్మాపురం, వెంకటంపేట, ఏరుకొల్లు, తదితర పంచాయతీల్లో ఉపాధి పనులు ఆగిపోయాయి. ఫీల్డ్‌అసిస్టెంట్లపై కక్ష గట్టిన టీడీపీ నాయకులు మండలాధికారులపై ఒత్తిడి తెచ్చి ఉపాధి పనులు నిలుపుదల చేయించారు. తద్వారా కూలీలు వలస బాట పట్టేలా చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో మండలాధికారులు ఉపాధి పనులు నిలుపుదల చేయించి పనిదినాలు కల్పించలేదని ఫీల్డ్‌అసిస్టెంట్లకు నోటీసులివ్వడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గత నెల నుంచి పనిదినాల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. మండలంలో 7,070 జాబ్‌కార్డులు ఉండగా, 11,657 మంది కూలీలు ఉన్నారు. మేలో 38,667 పనిదినాలు, జూన్‌లో 20,464 పనిదినాలు కల్పించగా, జూలైలో కేవలం 940 పనిదినాలు మాత్రమే కల్పించారు. ఈ సంఖ్యను సాకుగా చూపించి కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లకు మాత్రమే నోటీసులు ఇచ్చి తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. వారికి కంటే తక్కువ పనిదినాలు కల్పించిన వారిని కొనసాగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసే వ్యక్తి విధిగా వంద రోజులు పనిచేసి ఉండాలి. ఫీల్డ్‌అసిస్టెంట్‌ను తొలగిస్తే వారి స్థానంలో మేట్‌కు అవకాశం కల్పించాలి. అయితే నిబంధనలకు పాతరేసిన అధికారులు దర్జాగా టీడీపీ నాయకులు సూచించిన వారికి అవకాశం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. తమకు అనుకూలమైన వారైతే లోపాయకారి ఒప్పందంతో బినామీ మస్టర్లు వేసుకుని నగదు దోపిడీ చేయొచ్చనే ఆలోచనతో టీడీపీ నాయకులు ఇలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫీల్డ్‌అసిస్టెంట్లతో పాటు కూలీలకు బెదిరింపులు

టీడీపీ నాయకుల ఒత్తిళ్లలతో ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉపాధి పనులు రెండు రోజులుగా నిలిచిపోయాయి. గత పది రోజులుగా అనంతసాగరం, చేజర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో పని చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లకు స్థానిక టీడీపీ నాయకులు ఫోన్ చేసి స్వచ్ఛందంగా మానేయాలని, తమకు అనుకూలమైన వ్యక్తులు ఇకపై కొనసాగుతారని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో ఏళ్ల తరబడి ఫీల్డ్‌అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి, తెలుగు తమ్ముళ్లకు మధ్యన వాదోపవాదాలు చోటు చేసుకుంటున్నాయి. వారం రోజుల క్రితం అనంతసాగరం మండలంలోని ఓ గ్రామంలో టీడీపీ నాయకుడు ఉపాధి ఫీల్డ్‌అసిస్టెంట్‌కు ఫోన్ చేసి నేను వద్దన్నా పనులు నిలిపివేయకుండా ఎందుకు చేయిస్తున్నావని రుబాబు చేశాడు. పనిదినాలు ఉన్నాయని అధికారులు చెబితే నిలిపివేస్తామని ఫీల్డ్‌అసిస్టెంట్ సర్దుబాటు ధోరణిలో చెబుతున్నా సదరు నాయకుడు వినిపించుకోలేదు. ఏకంగా లబ్ధిదారులకే ఫోన్ చేసి పనులు నిలిపివేసి వెనక్కు వెళ్లిపోవాలని బెదిరించినట్లు సమాచారం. అదేతీరుగా మరో గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను స్థానిక టీడీపీ నాయకుడు ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి గ్రామాల్లో ఉపాధి పనులు జరగడంలేదని, వైఎస్సార్‌సీపీ వారికే పనులు దక్కుతున్నాయని లేని ఆరోపణలు చేసినట్లు సమాచారం. దీంతో వారం రోజుల పాటు ఉపాధి పనులు నిలిపివేయాలని జిల్లా అధికారులకు మంత్రి ఆనం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీంతో పస్తులు ఉండాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పస్తులు ఉండాల్సిందే



ఉపాధి పనికి వస్తే పనులు నిలిపివేశామని వెనక్కు వెళ్లిపోవాలని ఫోన్లలో కొందరు బెదిరించారు. మీరు పని చేసినా నగదు ఎలా వస్తుందో మేము చూస్తామంటున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా లేవు. ఉపాధి పనులు లేకపోతే పస్తులు ఉండాల్సిందే.

–వడ్లపల్లి బుజ్జమ్మ, అనంతసాగరం

ఇదేం అన్యాయం



నా భార్యకు ఆరోగ్యం సరిగాలేదు.ఉపాధి పనులే ఆధారం. ఉపాధి పనులకు వెళ్తే ఏ వారానికి ఆ వారం కూలి అందుతుంది. కుటుంబ పోషణ జరుగుతుంది. అయితే కొందరు పనులు చేయొద్దని బెదిరిస్తున్నారు. ఇలా వారం రోజుల్లో ఇప్పటికే రెండుసార్లు పనులు నిలిపివేయించారు. ఇలా చేయడం ఏం న్యాయం.

– వెంకటయ్య, అనంతసాగరం

వెనక్కుపొమ్మంటున్నారు



గ్రామంలో కరువు పనులు బాగా జరుగుతున్నాయి. ఈ మధ్య కొందరు పనులు నిలిపేయాలని బెదిరిస్తున్నారు. మేము పట్టించుకోకుండా ఫీల్డ్ అసిస్టెంట్ చెప్పినట్లుగా నిత్యం వంద మందిమి పనులకు వస్తున్నాం. అయితే కొందరు వద్దన్నా ఎందుకు పనులకు వెళ్తున్నారని దబాయిస్తున్నారు. ఏ ఊరిలోనూ ఇలాంటి పరిస్థితి లేదేమో. పేదల కడుపుకొట్టడం అన్యాయం.

– నరసమ్మ, అనంతసాగరం

సోమశిలకు కృష్ణా జలాలు

సోమశిల: సోమశిల జలాశయానికి ఆదినిమ్మాయపల్లె రిజర్వాయర్ నుంచి 4 వేల క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వస్తోందని జలాశయం అధికారులు బుధవారం తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో పరవళ్లు తొక్కుతూ వస్తున్న కృష్ణా జలాలు ఆదినిమ్మాయపల్లె రిజర్వాయర్ నుంచి బుధవారం రాత్రి లేదా గురువారం తెల్లవారుజామునకు సోమశిల జలాశయానికి వచ్చి చేరే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం జలాశయంలో 9.496 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

పొలం గట్టు విషయంలో వివాదం

ఆత్మకూరు: మండలంలోని నువ్వూరుపాడులో పొలం సరిహద్దు గట్టు విషయంలో బుధవారం ఇద్దరు రైతుల నడుమ వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఇరువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వివరాలు..నువ్వూరుపాడుకు చెందిన నాగిరెడ్డి కొండారెడ్డి, పుట్టా వెంకటేశ్వర్లు పొలాలు పక్కపక్కనే ఉంటాయి. వాటి సరిహద్దు గట్టు విషయంలో ఇరువురికి గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు గురువారం సర్వేయర్‌ను గ్రామానికి పంపి సమస్యను పరిష్కరించాలని నిర్ణయించారు. అయితే బుధవారం సాయంత్రం ఇరువులరు రైతుల నడుమ మరోమారు గొడవ చోటుచేసుకుంది. ఇరువురు దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు.

వైద్యాధికారికి సన్మానం



అల్లూరు: స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో డాక్టర్‌గా పనిచేస్తున్న కే సుబ్బారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన్ని సహచర సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అల్లూరు: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ అన్నారు. మండలంలోని ఇస్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బేటి బచావో..బేటి పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు..వాటిని ఏ విధంగా అరికట్టాలి, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాలికల అక్రమ రవాణా, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆపద సమయంలో బాలికలు తమను తాము ఎలా కాపాడుకోవాలో వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే 1098 నంబర్‌కు సమాచారం అందజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీఓ శారద, సూపర్‌వైజర్ సౌజన్య, బీద గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

కొండారెడ్డి సేవలు అభినందనీయం



హెచ్‌ఎం కొండారెడ్డి దంపతులకు సత్కారం



వెంకటేశ్వర్లు దంపతులకు సత్కారం

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న యాలమూరి కొండారెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండారెడ్డి, అరుణ దంపతులను సహచర ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం కొండారెడ్డి అందించిన సేవలను కొనియాడారు.

పాఠశాలకు రూ.5 లక్షల నగదు విరాళం

జలదంకి ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడు, కావలి మోడరన్ టెక్స్‌టైల్స్ అధినేత మద్దుల నరసింహం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా రూ. 5 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వడ్డీతో ఏటా పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.15 వేలు, రూ.10వేలు, రూ. 5వేలు వంతున నగదు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. గతంలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా రూ.10 లక్షలతో స్టేజీని నిర్మించినట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థుల సంఘం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందజేస్తుందని తెలిపారు. సంఘ అధ్యక్షుడు హరినారపరెడ్డి, సెక్రటరీ లక్ష్మీరెడ్డి, ట్రెజరర్ ఎస్వీ శేషారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పులుగుంట మధురెడ్డి, జలదంకి ఉపసర్పంచ్ కూరపాటి మాలకొండారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డీ వెంకటేశ్వర్లు బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు దంపతులను హెచ్‌ఎం వీరభద్రయ్యతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు వేణుగోపాల్, చంద్రమౌళి, సుభద్ర, ఉప్పు కొండయ్య ,శ్రీనివాసులు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి సన్మానం



ఆత్మకూరు: పట్టణంలోని వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న యల్లావుల మాధవీలత బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాధవీలత దంపతులను హెచ్‌ఎం సీతాదేవి, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయినిగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 చలపతి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, గంగాధర్, మంజులవాణి, శశికళ, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి గండిపాళెం పాఠశాల

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాలను బుధవారం అద్దె భవనంలోకి మార్చారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ఎంఈఓ మస్తాన్‌వలి గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా అద్దె భవనంలోకి పాఠశాలను మార్చినట్లు తెలిపారు. నూతన భవన నిర్మాణం కోసం డీఈఓకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే కృషి

ఉదయగిరి:ఉదయగిరి, వింజమూరులో డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీ చెంచలబాబు యాదవ్ తెలిపారు. బుధవారం ఉదయగిరిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం పారదర్శక పాలనను అందిస్తోందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు పాటుపడుతున్నాన్నారు. ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తుందని చెప్పారు. పేదల ఇంటి నిర్మాణం కోసం ఇచ్చే నిధులను రూ.4 లక్షలకు పెంచడం హర్షణీయమన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

జలదంకి: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి రక్షణ పొందాలని జలదంకి వ్యవసాయశాఖ అధికారిణి బీ శైలజ సూచించారు. కావలి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు గాయాలై అధిక శాతం మంది ద్విచక్ర వాహనాలు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్ సభ్యుడు ఎం మాల కొండారెడ్డి మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లేని పక్షంలో జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ శ్యామల, ఏఈఓ మునెమ్మ, జయంపు కనకయ్య పాల్గొన్నారు.

బాధితుడికి న్యాయం చేయాలి

సోమశిల: విద్యార్థి తండ్రిపై దాడికి పాల్పడిన ఉప్పలపాడు లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కార్యదర్శి జగదీష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప్పలపాడు లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో విద్యార్థి తండ్రిపై యాజమాన్యం దాడికి పాల్పడిన ఘటనను ఖండిస్తూ బీజేపీ యువమోర్చ రాష్ట్ర నాయకులు సాంబశివారెడ్డి మాట్లాడిన మాటలను విద్యాశాఖ అధికారులు ఖండించడం సమంజసం కాదన్నారు. బీజేపీ అడిగిన స్కూల్‌కు సంబంధించిన వివరాలపై వివరణ ఇవ్వకుండా, పొంతన లేని వివరణలు ఇచ్చారని విచారం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం తమ పని కాదని మండల విద్యాధికారులు వ్యాఖ్యానించడం సబబు కాదన్నారు. కేవలం ప్రభుత్వ పాఠశాలలకే కాకుండా ప్రైవేట్ పాఠశాలలకు కూడా మీరు విద్యాశాఖ అధికారులేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పేపర్లలో వచ్చిన వార్తలపై విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి ఖండించడంపై ఉన్న శ్రద్ధ బాధితుడికి న్యాయం చేయడంపై పెడితే మంచిదని హితువుపలికారు. దాడి ఘటనపై సమగ్ర నివేదిక అందించి ఉంటే రోజులు గడుస్తున్నా ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. విద్యార్థి తండ్రి ఆస్పత్రిలో ఉన్నాడని, ఆయన భార్య ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. న్యాయం వైపు మాట్లాడిన బీజేపీపై బురదజల్లే ప్రయత్నం మాని ఇప్పటికైనా బాధితుడికి న్యాయం జరిగేలా విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

సంగం: కుటుంబ కలహాలతో ఒంటరిగా ఉంటున్న ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు.. జెండాదిబ్బ పంచాయతీ పరిధిలోని మఠం కాలనీకి చెందిన సోమా రామయ్య (42)కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఐదేళ్ల క్రితం ఇంట్లో జరిగిన గొడవలతో భార్యా బిడ్డలు బుచ్చిరెడ్డిపాళెంలో నివాసం ఉండగా, రామయ్య ఒంటరిగా జెండాదిబ్బ మఠం కాలనీలోని నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన రామయ్య రెండు రోజుల క్రితం తన ఇంట్లో ఫ్యాన్ హుక్కుకు టవల్‌తో ఉరేసుకున్నాడు. బుధవారం రామయ్య నివాసం నుంచి దుర్గంధం రావడంతో గమనించిన చుట్టు పక్కల వారు తలుపు తెరిచి చూడగా శవమై వేలాడుతూ కనిపించాడు. దీంతో సంగం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు సత్కారం



మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలంకేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ సిరాజుద్దీన్ బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ దంపతులను వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒంగోలు ఆర్ఎం లక్ష్మణరావు, విశ్రాంత ప్రాంతీయ అధికారులు మన్మథరావు, ఆదిశేషయ్య, పొదిలి వేలం నిర్వహణాధికారి జీ గిరి రాజ్‌కుమార్, కనిగిరి వేలం నిర్వహణాధికారి బీ కోటేశ్వరరావు, రైతులు, పొగాకు బోర్డు సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జంపాకు నివాళి



జంపా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు

వరికుంటపాడు: జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు జంపా కృష్ణకిషోర్ సంస్మరణ సభను వరికుంటపాడులో బుధవారం నిర్వహించారు. జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి బీవీ రమణయ్య ఆధ్వర్యంలో కృష్ణకిషోర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంపా సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పీ మాల్యాచలం, చెన్నకేశవులు, రమణయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గంధ మహోత్సవం

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న హజరత్ ఖ్వాజాషా సయ్యద్ అబ్దుల్‌ఖాదర్ ఖాన్‌సాహెబ్ ఖాదిరి ఔలియా వారి దర్గాలో 219వ గంధ మహోత్సవం శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు బుధవారం తెలిపారు. తొలిరోజు సొందల్‌మాలి, 3న గంధమహోత్సవం, 4న జపేదిహిరాగి ఫాతెహా, 5న తహలీల్ ఫాతెహా కార్యక్రమంతో గంధమహోత్సవం ముగుస్తుందన్నారు. ప్రతిరోజూ భక్తులకు అన్నదానంతో పాటు పాటకచ్చేరి, ఖవ్వాలి, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.